నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, బుధవారం 16 అక్టోబర్ 2024 | WARANGAL

నర్సంపేట రూరల్: సర్వాపురంలోని గురుకుల పాఠశాలకు తాళం వేస్తున్న యజమాని నూకల కృష్ణమూర్తి

దుగ్గొండి : గిర్నిబావిలోని ఎంజేపీ తాళం వేసి నిరసన తెలుపుతున్న రాజేందర్‌రెడ్డి

వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని ఎంజేపీ గురుకులానికి తాళం వేయడంతో బయట నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సంపేట రూరల్ : ద్వారకపేటలో గురుకుల పాఠశాలకు తాళం వేస్తున్న యజమాని వల్లాల శ్రీహరి

అద్దె బకాయిల భారం
గురుకులాలకు తాళం

- విసిగిపోయి తాళం వేసి భవన యజమానుల నిరసన
- పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం
- పాఠశాలల బయటే సిబ్బంది, విద్యార్థుల పడిగాపులు
- ఆందోళనతో దిగి వచ్చిన ప్రభుత్వం
- సాయంత్రం కొన్ని నెలల అద్దె విడుదల
- మొత్తం బకాయిలు చెల్లించాలని డిమాండ్

పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యనందించే లక్ష్యంతో గత కేసీఆర్ సర్కారు గురుకులాల వ్యవస్థకు శ్రీకారం చుడితే ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం మాత్రం నిర్వీర్యం చేయాలని చూస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ విద్యాశాఖను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడమే గాక ఎనిమిది నెలలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల అద్దె బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేస్తోంది. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెట్టడంతో విసిగిపోయిన భవనాల యజమానులు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో దసరా సెలవుల తర్వాత పాఠశాలలకు చేరుకున్న అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను బడి బయటే ఉండాల్సి వచ్చింది. అయితే యజమానుల ఆందోళనతో దిగొచ్చిన సర్కారు కొన్ని నెలల బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో పాఠశాలలు తెరుచుకున్నాయి. మిగతావి కూడా వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

- నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 15

ఎనిమిది నెలలుగా చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం

తొర్రూరు/గూడూరు/భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్/రేగొండ/నర్సంపేట రూరల్/ ఖానాపురం/ చెన్నారావుపేట/దుగ్గొండి/కరీమాబాద్ : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ గురుకులాల భవనాల అద్దె చెల్లింపులను ప్రభుత్వం కొద్ది నెలలుగా నిలిపివేయడంతో వాటి యజమానులు మంగళవారం పాఠశాలల గేట్లకు తాళాలు వేశారు. సిబ్బంది, విద్యార్థుల ఆందోళనలు, మరోవైపు తాళాలు తీయకుండా క్రిమినల్ కేసులు పెడుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించడంతో పరిస్థితి చేయిదాటుతుందని ప్రభుత్వం భావించింది. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలుగచేసుకుని సాయంత్రం వరకు కొన్ని నెలల బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి గేట్లు తెరుచుకున్నాయి. బీసీ గురుకులాలకు మూడు నెలలు, మైనార్టీ గురుకులాలకు నాలుగు నెలల అద్దె బకాయిలను యజమానుల అకౌంట్లలోకి నేరుగా పంపిడంతో భవనాల యజమానులు కొంత ఊరట చెందారు.

పాఠశాల బయటే పడిగాపులు

గురుకులాలకు గేట్లు వేయడంతో అధ్యాపకులు, విద్యార్థులు బయటే పడిగాపులు కాయాల్సి వచ్చింది. దసరా పండుగ తర్వాత పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఉత్సాహంగా వచ్చిన పిల్లలు తాళం వేసి ఉండడం చూసి నివ్వెరపోయారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల గురుకులాల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది. వరంగల్‌లోని ఉర్సు గుట్ట వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనం, నర్సంపేట ద్వారకాపేటలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర కళాశాల వసతి గృహానికి, సర్వాపురం శివారులోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, చెన్నారావుపేట బాలికల సాంఘిక సంక్షేమ, ఖానాపురం మండలం ఐనపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల, దుగ్గొండి మండలం గిర్నిబావిలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలకు యజమానులు తాళం వేశారు. అలాగే మహబూబాబాద్ జిల్లా తొర్రూరుతో పాటు నాంచారిమడూర్‌లోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, తొర్రూరులోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, గూడూరు ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు తాళం వేశారు. భూపాలపల్లి జిల్లా రేగొండలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర, గాంధీనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల ఆశ్రమ గురుకుల పాఠశాల, ములుగు మండలం మల్లంపల్లిలో కొనసాగుతున్న ఏటూరునాగారం టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర జూనియర్ కాలేజీకి యజమానులు తాళం వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కేవలం ఒక నెలకు సంబంధించిన అద్దెను మాత్రమే యజమానులకు చెల్లించగా సుమారు ఎనిమిది నెలల బకాయిల చెల్లింపు పెండింగ్‌లో పెట్టడంతో భవన యజమానులు గేట్లకు తాళాలు వేసి మంగళవారం నిరసన తెలిపారు.

రేగొండ : బాలుర గురుకులానికి తాళం వేసిన యాజమాని కటకం రాజు

భూపాలపల్లి రూరల్ : మైనారిటీ గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని దేవేందర్ రెడ్డి

తొర్రూరు : నాంచారిమడూర్ ఎంజేపీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలకు తాళం వేయడంతో బయట నిరీక్షిస్తున్న కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

చెట్ల కింద పడిగాపులు.. మధ్యాహ్న భోజనానికీ తిప్పలు

ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ములుగు మండలంలోని మల్లంపల్లిలోని అద్దె భవనంలో కొనసాగుతోంది. అద్దె బకాయిల కోసం యజమానుల గేట్లకు తాళం వేయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు, వారిని తీసుకొచ్చిన తల్లిదండ్రులు గురుకుల ఆవరణలో ఉన్న మామిడి చెట్ల కింద పడిగాపులు కాశారు. ఈ గురుకులంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ కలిపి 600మంది చదువుతుండగా సెలవుల ముగియడంతో మంగళవారం వచ్చారు. మధ్యాహ్న భోజనం లేక ఆకలికి అలమటించారు. సాయంత్రం వరకు తాళం తీయకపోవడంతో గురుకుల సిబ్బంది తల్లిదండ్రులకు నచ్చజెప్పి తాము సమాచారం అందించినప్పుడు విద్యార్థులను తీసుకొని రావాలని చెప్పి ఇంటికి పంపించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు తల్లిదండ్రులు గురుకుల సిబ్బందితో గొడవపడి పిల్లలను తీసుకొని వెళ్లారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అంకయ్యను వివరణ కోరగా కిరాయి చెల్లించకపోవడంతో భవన యజమాని వద్ద పనిచేసే వ్యక్తి వచ్చి తాళం వేశాడని, యజమానితో మాట్లాడినప్పటికి వినలేదని తెలిపారు. తాను ఉపాధ్యాయులతో కలిసి ఆర్సీవో కార్యాలయానికి వెళ్తున్నట్లు తెలిపారు. అలాగే రేగొండలోనూ మధ్యాహ్నం వరకు గేట్లకు తాళం తీయకపోవడంతో విద్యార్థులు పస్తులుండాల్సి వచ్చింది.

ములుగు రూరల్ : మల్లంపల్లిలోని టీడబ్ల్యూఆర్ఎస్ కళాశాలకు తాళం వేస్తున్న దృశ్యం

ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోలేదు..

రాష్ట్ర ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థులకు ఇబ్బంది కావద్దని ఎనిమిది నెలలుగా ఎదురుచూశాం. గురుకుల పాఠశాల భవనానికి నెలకు రూ.3 లక్షలు, కళాశాల భవనానికి నెలకు రూ.4,50,601 చొప్పున యజమానులకు ఎనిమిది నెలల బకాయిలు రావాల్సి ఉంది. బ్యాంకుల్లో తెచ్చుకున్న లోన్లకు కిస్తీలు సకాలంలో చెల్లించేందుకు అప్పులు చేస్తున్నారు. మా బాధను అర్థం చేసుకొని బకాయిలు చెల్లించాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేసేది లేక భవన యజమానులందరం కలిసి గేట్లకు తాళాలు వేసి నిరసన తెలపాల్సి వచ్చింది. ప్రభుత్వం కొన్ని నెలల బకాయిలు విడుదల చేసినందుకు ధన్యవాదాలు. మిగితావి కూడా త్వరలో చెల్లిస్తారన్న ఆశాభావంతో ఉన్నాం.

– అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

తొర్రూరులో గురుకుల భవనానికి తాళం వేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి

లను లోపలికి అనుమతించకపోవడంతో వారు బయటే పడిగాపులు కాయాల్సి వచ్చింది. పలుమార్లు అధికార యంత్రాంగానికి, మంత్రులను కలిసి విన్నవించినా వారు పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ప్రతి నెల ఈఎంఐ చెల్లించడం కోసం అప్పు చేయాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సిబిల్ స్కోర్ దెబ్బతిని రుణాలు తీసుకోలేని పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఓ వైపు యజ

రెగ్యులర్ ఈఎస్ నియామకమెప్పుడు?

- ఎనిమిది నెలలుగా ఖాళీగానే ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుర్చీ
- గత నెల ఉద్యోగ విరమణ చేసిన ఇన్‌చార్జి అధికారి
- పదిహేను రోజులైనా ఎవరికీ ఇవ్వని పోస్టింగ్
- మద్యం అమ్మకాలపై కొరవడిన పర్యవేక్షణ
- ఎమ్మార్పీ ఉల్లంఘన, గుడుంబా తయారీపై నిఘా నిల్
- వరంగల్ ఎక్సైజ్ శాఖ పనితీరుపై సర్వత్రా విమర్శలు

వరంగల్, అక్టోబర్ 15(నమస్తేతెలంగాణ) : వరంగల్ జిల్లాలో ఎక్సైజ్‌శాఖ పనితీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఎనిమిది నెలల నుంచి ఈ శాఖకు రెగ్యులర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) లేరు. ఈ నెల ఒకటి నుంచి ఈఎస్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను కూడా ప్రభుత్వం ఎవరికీ అప్పగించలేదు. దీంతో మద్యం అమ్మకాలపై పర్యవేక్షణ కొరవడింది. గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలు పెరిగిపోతున్నాయి. గతంలో వరంగల్ (వరంగల్ రూరల్) ఈఎస్‌గా పనిచేసిన లక్ష్మానాయక్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బదిలీపై సూర్యాపేట జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. అప్పట్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేసిన నాగేందర్‌రావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. పదిహేను రోజులు గడిచినా వరంగల్‌కు రెగ్యులర్ ఈఎస్ నియామకం, కనీసం మరో అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించలేదు. పైగా జిల్లా కార్యాలయంలోని ఈఎస్ చాంబర్ వద్ద నాగేందర్‌రావు పేరుతో నేమ్ ప్లేట్ దర్శనమిస్తున్నది. సమాచార హక్కు చట్టం బోర్డుపై కూడా ఆయన పేరే ఉంది. వాటిని తొలగించాల్సి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) మురళీధర్ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఈఎస్ కార్యాలయం పనిచేస్తున్నది. నాగేందర్‌రావు ఉద్యోగ విరమణ తర్వాత ఇప్పటివరకు ప్రభుత్వం శాఖలో ఎవరికీ ఈఎస్‌గా బాధ్యతలు అప్పగిస్తూ డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆర్డర్(డీడీవో) జారీ చేయలేదు.

కొరవడిన పర్యవేక్షణ

ఎనిమిది నెలలుగా రెగ్యులర్ ఈఎస్ లేకపోవడం, ఏడు నెలలకుపైగా ఇన్‌చార్జి కొనసాగడం, పదిహేనురోజుల నుంచి ఎవరూ లేకపోవడంతో జిల్లా పరిధిలో మద్యం విక్రయాలపై పర్యవేక్షణ, నిఘా కొరవడింది. ఇన్‌చార్జిగా ఉన్న నాగేందర్‌రావు ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలు కూడా నిర్వహించడంతో జిల్లాలో ఈఎస్‌గా పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తించలేదనే ఆరోపణలొచ్చాయి. ఏఈఎస్ మురళీధర్ కూడా అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులున్నాయి. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాలపై పర్యవేక్షణ కొరవడింది. ఎమ్మార్పీ ఉల్లంఘన జరుగుతున్నది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరపై బ్రాందీ, బీర్ల అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఎమ్మార్పీ ఉల్లంఘనపై వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మద్యం ప్రియులు అనేకసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నియంత్రించాల్సిన స్థానిక ఎక్సైజ్ అధికారులు వైన్‌షాపుల యజమానులకు తమవంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. నిఘా కొరవడడం వల్ల జిల్లాలోకి బెల్లం, పటిక రవాణాతో పాటు గుడుంబా తయారీ, అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గంజాయి రవాణా, విక్రయాలు కూడా విచ్చలవిడిగా సాగుతున్నాయి. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, టీం ఉన్నా తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో ఎక్సైజ్ శాఖ పనితీరు పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఈఎస్ చాంబర్ వద్ద నాగేందర్‌రావు పేరుతో ఉన్న నేమ్ ప్లేట్

ఈఎస్ కార్యాలయంలోని సహ చట్టం బోర్డుపై తొలగించని నాగేందర్‌రావు పేరు

ప్రశాంత్ కుటుంబానికి కేటీఆర్ భరోసా

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబర్ 15 : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన సిక ప్రశాంత్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఇటీవల ప్రశాంక్ మృతిచెందడంతో అతడి భార్య, మూడేళ్ల కూతురు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు ట్విట్టర్(ఎక్స్) ద్వారా తెలుసుకొన్న కేటీఆర్ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కేటీఆర్ స్ఫూర్తితో తనవంతుగా ఎన్ఆర్ఐ పొట్టి శ్రీనివాస్ రూ.50వేలు ఆర్థిక సాయం అందించగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో ప్రశాంత్ భార్యకు చెక్కును కేటీఆర్ అందజేశారు.

కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు

- తమ వారినే నియమించాలంటూ ఇరు వర్గాల గొడవ
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట రామచంద్రాపురం నేతల వాగ్వాదం

బయ్యారం, అక్టోబర్ 15 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల నాయకుల మధ్య ఇందిరమ్మ కమిటీల చిచ్చు రగిలింది. తాము సూచించిన వారినే కమిటీలో నియమించాలంటూ మంగళవారం మండల పరిషత్ కార్యలయం బయట గొడవకు దిగారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన ముగ్గురు వ్యక్తుల పేర్లు ఇవ్వాలని కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ మంగీలాల్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లును అధికారులు కోరారు. వారిరువురు తమ వర్గానికి చెందిన వేర్వేరు వ్యక్తుల పేర్లను సూచించారు. ఈ క్రమంలో పేర్లను ఫైనల్ చేసేందుకు ఇరు వర్గాలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోగా వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ గ్రామ నాయకులు పేర్లెలా ఇస్తారని ఒక వర్గం.. మాజీ ప్రజాప్రతినిధులు పేర్లు సూచించడమేంటని మరో వర్గం నేతలు వాదనకు దిగారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు తమపై పెత్తనం చేస్తున్నారని పాత కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తే.. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశామని, తమకు సముచిత స్థానం కల్పించాలని కొత్త నాయకులు వాదించుకున్నారు. ఎంతకూ విషయం తేలకపోవడంతో కార్యదర్శి రామస్వామి ఇరు వర్గాలు నాయకులు ఇచ్చిన పేర్లను ఉన్నతాధికారులకు అందించారు. అయితే మండలంలోని మరి కొన్ని గ్రామాల్లోనూ ఇలాంటి పంచాయితీలే జరుగుతున్నట్లు తెలిసింది.

బయ్యారం ఎంపీడీవో కార్యాలయం బయట ఇందిరమ్మ కమిటీల విషయమై వాగ్వాదం చేసుకుంటున్న రామచంద్రాపురం కాంగ్రెస్ నాయకులు

పత్తాలేని కొనుగోలు కేంద్రాలు

- కోతల కాలం వచ్చినా అందని రైతుభరోసా
- మంత్రిని, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

భీమదేవరపల్లి, అక్టోబర్ 15 : వరి కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పత్తా లేవని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వడ్లకు ఇస్తామన్న బోనస్ హామీ బోగస్‌గా మారిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం ఇవ్వలేదని, ఏకకాలంలో రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదన్నారు. మొదటి సంతకం రుణమాఫీ మీద అని చెప్పి తర్వాత డిసెంబర్ 9, ఆగస్టు 15 అని బుకాయించి తీరా కొమురెల్లి మల్లన్న, యాదాద్రి నర్సన్న, భద్రాద్రి రామయ్య, మేడారం సమ్మక్క–సారలమ్మల మీద ఒట్టుపెట్టిన సీఎం.. ఇచ్చిన మాట ఎందుకు నిలబెట్టుకోలేకపోయాడో చెప్పాలని ప్రశ్నించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ అని, ఇప్పుడు సన్నాలకు మాత్రమేనని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. రైతులందరికీ రైతుభరోసా, రుణమాఫీ చేసేవరకూ వదిలి పెట్టేది లేదని తేల్చిచెప్పారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు వచ్చే మంత్రిని, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం ఉద్యోగుల వేతనాలు నిలిపివేసి రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ అందజేశారని గుర్తుచేశారు. రైతులు అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పడిపోతున్న పత్తి ధర

- పేరుకుపోయిన నిల్వలు
- అధిక తేమతో ఇబ్బందులు

మార్కెట్‌కు వచ్చిన పత్తి బస్తాలు

కాశీబుగ్గ, అక్టోబర్15 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మంగళవారం పత్తి ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ నెల నుంచి మద్దతు ధర క్వింటాకు రూ. 7,521 ఉండగా మంగళవారం రూ. 6,900 పలికింది. తేమ అధికంగా ఉండడం వల్లే ధర తగ్గుతున్నదని అధికారులు తెలిపారు. రైతులు పత్తిని ఆరబెట్టుకొని వస్తే మద్దతు ధర వచ్చే అవకాశం ఉన్నట్లు చెప్పారు. మంగళవారం 1,592 బస్తాలు రాగా లూజు 37 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. గరిష్ఠంగా రూ. 6,900, మధ్యరకం రూ. 6,350, కనిష్ఠంగా రూ. 5 వేలు ధర పలికింది. గత ఏడాది అత్యధికంగా క్వింటాకు రూ. 7,160 రాగా, ఈ సీజన్ ప్రారంభంలో రూ.7 వేల వరకు ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దూదికి డిమాండ్ లేకపోవడంతో నిల్వలు పెరిగిపోయాయని, దీంతో ధర తగ్గే అవకాశాలున్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు తేమ 15 నుంచి 30 శాతం వరకు ఉంటుందన్నారు.

కొనుగోలుకు సిద్ధమవుతున్న సీసీఐ

భారత ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే టెండర్లు ఖరారైనట్లు సమాచారం. అలాగే వరంగల్ మార్కెట్ కమిటీ పరిధిలో 27 జిన్నింగ్ మిల్లులుండగా అందులో ఆధునికమైన 13 టీఎంసీ మిల్లులను నోటిఫై చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకు మార్కెట్ కమిటీ సిబ్బంది 10 టీఎంసీ మిల్లుల్లో సీసీఐకి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసినట్లు సమాచారం.